www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 12 అక్టోబరు 2023

వ్యవసాయ విద్యుత్ కోతలు ఆపాలని ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

వ్యవసాయ విద్యుత్ కోతలపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని రాఘవాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతులు ధర్నా చేపట్టారు. విద్యుత్ కోతల ఫలితంగా సాగునీరందక పొట్ట దశలో ఉన్న వరి చేలు దెబ్బతిని నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం మండల నాయకులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయానికి పగలు తొమ్మిది గంటల విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీకటి వెంకటేశ్వర్లురావు, సిహెచ్.వెంకట్రావు, ఎం.శ్రీనివాసరావు, ఎ.రమేష్, ఎం.వెంకట అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

కరెంటు కోత...!



- తొమ్మిది గంటల వ్యవసాయ కరెంటు సరఫరా మాటలకే పరిమితం
- రోజుకు ఐదారు గంటలు ఇవ్వడం కష్టమే
- అదీ విడతల వారీగా సరఫరాతో అవస్థలు
- రోజుకు అరెకరం కూడా తడవని దుస్థితి
- పొట్టదశలోని వరి పొలాలు చూసి రైతుల ఆవేదన
- సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనకు దిగుతున్న అన్నదాత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి పూర్తిగా పొంతన లేకుండాపోయింది. తొమ్మిది గంటల కరెంటు ఒకేవిడతగా సరఫరా చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా గొప్పలు వట్టి బూటకమని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయానికి కరెంటు సరఫరాలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై అన్నదాత మండిపడుతున్నాడు. పొట్టదశలో ఉన్న వరిపొలాలకు నీరు లేక ఎండిపోతుండటంతో అన్నదాత ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. వ్యవసాయానికి నిరంతరాయంగా తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలంటూ బుధవారం చింతలపూడి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు రాఘవాపురం సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ప్రస్తుత కరెంటు కోతలకు నిదర్శనంగా దీన్ని చెప్పొచ్చు. ఏలూరు జిల్లాలో 27 మండలాలుండగా అత్యధిక మండలాలు మెట్టప్రాంతంలోనే ఉన్నాయి. ప్రస్తుత ఖరీఫ్‌లో ఏలూరు జిల్లావ్యాప్తంగా దాదాపు 2.30 లక్షల ఎకరాల్లో వరిసాగు సాగగా వ్యవసాయ బోర్ల కింద సాగుతున్న సాగు పెద్దఎత్తున ఉంది. దాదాపు లక్షకుపైగా బోర్ల కింద రైతులు వ్యవసాయం సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పంట కీలక దశకు చేరుకుంది. పంటంతా పొట్టదశలో ఉంది. ఇటువంటి తరుణంలో వ్యవసాయ మోటార్లకు విధిస్తున్న కరెంటు కోతలతో అన్నదాత తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు. ఇప్పటికే ఎకరాకు రూ.25 వేలకుపైగా రైతులు పెట్టుబడి పెట్టారు. ఇష్టానుసారం విధిస్తున్న కరెంటు కోతలతో బోర్లు పని చేయక పంటకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో పంట చేతికొస్తుందో.. లేదో అనే భయం రైతులను వెంటాడుతోంది. వ్యవసాయానికి తొమ్మిది గంటలు నిరంతరాయంగా సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నా వ్యవసాయానికి ఆరు నుంచి ఏడు గంటలు కూడా కరెంటు సరఫరా చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదీ నాలుగు గంటలు ఒక విడతగా, మరో రెండు గంటలు, గంట అన్నట్లు కరెంటు సరఫరా చేస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. ఒకవైపు వర్షాలు సరిగా పడకపోవడం, మోటార్లకు కరెంటు లేకపోవడంతో పంట దెబ్బతినే పరిస్థితి నెలకొంది. చింతలపూడి మండలంలోని రాఘవాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు ప్రస్తుతం కొనసాగుతున్న షిఫ్ట్ ప్రకారం రాత్రి రెండు గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు వ్యవసాయ మోటార్లకు కరెంటు సరఫరా చేయాల్సి ఉంది. నాలుగు గంటలకు కరెంటు ఇచ్చి 7.30 గంటలకు కరెంటు కోత విధించినట్లు రైతులు చెబుతున్నారు. గట్టిగా మాట్లాడితే తర్వాత మరో రెండు గంటలు ఇస్తున్నారని తెలుస్తోంది. దీంతో రోజుకు అరెకరం భూమి కూడా తడవడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో ఆగ్రహించిన చింతలపూడి మండలంలోని గణిజర్ల, రాఘవాపురం, అంకాలయ్య కొత్తగూడెం, యండపల్లి వంటి గ్రామాలకు చెందిన రైతులు రాఘవాపురం సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. సమస్యను పరిష్కరిస్తామంటూ విద్యుత్ అధికారులు చెప్పడంతో విరమించారు. అధికారులు సమస్యను పరిష్కరిస్తారా.. లేదా అనే భయం మాత్రం రైతులను వెంటాడుతోంది.

కరెంటు కోతలతో నలిగిపోతున్నాం

ఎం.శ్రీనివాసరావు, రాఘవాపురం

ప్రస్తుతం కొనసాగుతున్న షిఫ్ట్ ప్రకారం రాత్రి రెండు గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు కరెంటు సరఫరా చేయాలి. కానీ తెల్లవారుజామున నాలుగు గంటలకు ఇచ్చి ఉదయం 7.30 గంటలకు ఆపేస్తున్నారు. మళ్లీ ఇస్తే ఒక గంట, రెండు గంటలు ఇస్తున్నారు. రోజుకు అరెకరం కూడా తడవడం లేదు. పది హెచ్‌పి కెపాసిటీ మోటార్లున్నా నీరు రావడం లేదు. పదెకరాల్లో వరి సాగు చేశాను. పంట పొట్టదశలో ఉంది. ఈ తరుణంలో కోతలు రైతులను తీవ్రంగా దెబ్బతీసే పరిస్థితి నెలకొంది. కరెంటు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాం.

కరెంటు కోతలతో పొట్టదశలో ఉన్న వరి పంటకు దెబ్బ

చీకటి శ్రీనివాస్, అంకాలయ్య కొత్తగూడెం, చింతలపూడి మండలం

ఐదెకరాల్లో వరిసాగు చేశాను. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉంది. పొలాలకు కూడా నీరు అవసరం. రోజుకు ఏడు గంటలు కూడా కరెంటు ఇవ్వడం లేదు. అదీ ఒకసారి నాలుగు గంటలు, మరోసారి రెండు గంటలు అన్నట్లు కరెంటు సరఫరా చేస్తున్నారు. దీంతో వరిపంట దెబ్బతినే పరిస్థితి నెలకొంది. విడతలవారీగా ఇవ్వడం, తక్కువ సమయం ఇవ్వడంతో రోజుకు అరెకరం కూడా తడవని పరిస్థితి ఏర్పడింది. నిరంతరాయంగా తొమ్మిది గంటలు ఇస్తే పంట గట్టెక్కుతుంది. లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

రోజుకు ఏడు గంటలు మించి కరెంటు ఇవ్వడం లేదు

మామిడిపల్లి అప్పారావు, గణిజర్ల

ఒకేసారి కాకుండా విడతలవారీగా రోజుకు ఏడు గంటలు మాత్రమే వ్యవసాయానికి కరెంటు ఇస్తున్నారు. పదెకరాల్లో వరిసాగు చేశాను. పొట్టదశలో ఉన్న పంట ఏమవుతుందోనన్న భయం వెంటాడుతోంది. కరెంటు గురించి అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదు. ఓ పది రోజులు కరెంటు సవ్యంగా ఇస్తేనే వరిపంట గట్టెక్కుతుంది. వర్షాలు లేకపోవడం, కరెంటు కోతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నిరంతరాయంగా తొమ్మిది గంటలు కరెంటు సరఫరా చేసి పంటను కాపాడాలని కోరుతున్నాం.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి సాబ్జీ

ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మె

విఓఎల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

విజయవంతంగా 36 గంటల ధర్నా

ఉద్యోగులకు ఎంఎల్‌సి షేక్ సాబ్జీ సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వెలుగు విఓఎ, మెప్మా ఆర్‌పిల సమస్యలను సిఎం జగన్ ప్రభుత్వం పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని వెలుగు విఒఎ యానిమేటర్ల సంఘం (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి హెచ్చరించారు. 36 గంటల ధర్నాలో భాగంగా రెండో రోజు ధర్నాలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శాసనమండలిలో సమస్యలు ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. మహిళలు 36 గంటలుగా అన్ని జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాలు వద్ద ఆందోళన చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూడడం అన్యాయమన్నారు. అనంతరం ధనలక్ష్మి మాట్లాడుతూ విఒఎ, ఆర్‌పిలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొదుపు సంఘాలకు అనేక ప్రభుత్వ పథకాలందిస్తున్నా కనీస వేతనాలు లేవని, ప్రస్తుతం ఇస్తున్న రూ.ఎనిమిది వేలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో కూడా వేయడంలేదని ఆమె తెలిపారు. విఒఎలకు మహిళా మార్టులు పెట్టి సంఘాలకు కోళ్లు, గొర్రెలు, మేకలు, గేదెల యూనిట్లు అందించాలనే పేరుతో టార్గెట్లు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు భిన్నంగా కాల పరిమితి సర్క్యులర్ తీసుకువచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ శిబిరం వద్దకు డిఆర్‌డిఎ పీడీ వచ్చి వినతిపత్రం స్వీకరించారు. తన పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని మిగిలిన అంశాలను ప్రభుత్వానికి నివేదిక పంపుతామని హామీ ఇచ్చారు.

ఈ ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సుభాషిణి, వివిధ సంఘాల నాయకులు ఎం.నాగమణి, ఫ్రాన్సిస్, లెనిన్ ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా నాయకులు మేరీ, ఆమని, ఆదిలక్ష్మి, మహాలక్ష్మి, నీరజ, కృష్ణకుమారి, కిరణ్మయి, వెంకటలక్ష్మి, జగదాంబ, వి.సాయిబాబు, గోపి, బి.జగన్నాధం నాయకత్వం వహించారు.

'ఉపాధి హామీ'ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి : వ్యకాస

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. ఉపాధి హామీ రక్షణకు వ్యవసాయ కార్మిక సంఘం ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఎంపిడిఒ పి.మల్లీశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టం అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగా సాధించుకున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచే కష్టజీవులకు పనైనా చూపండి, తిండైన పెట్టాలని నిర్వహించిన పోరాటాల ఫలితంగా భూ సంస్కరణల చట్టాలు వచ్చినట్లు తెలిపారు. 2004లో పార్లమెంట్‌లో 62 వామపక్ష పార్లమెంట్ సభ్యుల మద్దతు తీసుకున్న అప్పటి యుపిఎ ప్రభుత్వం మంత్రి పదవులిస్తామని చెప్పిన తమకు పదవులు కాదని, ప్రజలకు హక్కులు, చట్టాలు కావాలని వామపక్షాలు కోరాయని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు పని గ్యారంటీ చట్టం ఉండాలనే ఒత్తిడి కారణంగా 2005-06లో ఉపాధి చట్టం వచ్చిందని తెలిపారు. ఈ చట్టాన్ని నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదికి 200 రోజుల పనిదినాలు, రూ.600 కూలి ఇవ్వాలని, అనేక మంది ఆర్థికవేత్తలు సైతం కోరుతున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రూ.రెండు లక్షల 60 వేల కోట్లు కేటాయిస్తే మందగమనంలో ఉన్న ఆర్థికవ్యవస్థ మెరుగుపడుతుందని మేధావులు చెబుతున్నారన్నారు. ఇలాంటి విషయాలు, పాలకవర్గాలకు చెవికెక్కడం లేదన్నారు. ప్రకృతిలో వస్తున్న మార్పుల కారణంగా పనుల్లేక గ్రామీణ పేదలు పట్టణాలకు పెద్ద సంఖ్యలో వలసలుపోతున్నట్లు తెలిపారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఇప్పటికే పట్టణాల్లో ఉపాధి హామీ చట్టం ప్రారంభించారని, ఇక్కడ కూడా ప్రారంభించాలని, బడ్జెట్‌లో నిధులు పెంచాలని, అన్నిరకాల అలవెన్సులు, ప్రమాదబీమా సౌకర్యం పెంచాలని, చట్టాన్ని పగడ్బందిగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మహంకాళిరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాదవ, సురేష్ పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: ఉపాధి పని ప్రదేశాల్లో తాగునీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని, పాత పద్ధతిలోనే ఉపాధి పనులు చూపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఏలూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు వేతనాలు సకాలంలో అందడం లేదన్నారు. జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల ద్వారా ఎపిఒ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసిందని, దీనిపై కూలీలు ప్రశ్నిస్తే పే స్లిప్పులు, మాస్టర్ షీట్లు ప్రింటింగ్‌కు ఇవ్వాలంటున్నారన్నారు. దీనిపై దర్యాప్తు చేపట్టాలని పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదని మండిపడ్డారు. సమస్య పరిష్కరించకుంటే కూలీలందరినీ ఐక్యం చేసి జిల్లా ఆఫీసు ముందు ఆందోళన చేస్తామని అధికారులకు హెచ్చరించారు. ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటోల విధానం వల్ల పనిలో నాణ్యత తగ్గేలా విధానాలున్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ, ఎస్.మహంకాళిరావు, జిల్లా సహాయ కార్యదర్శి రాజమండ్రి దానియేలు, యు.వెంకటేష్, ఎం.సుధారాణి, సీనియర్ నాయకులు సత్తు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

18న రాష్ట్ర సదస్సు

ఏలూరు అర్బన్: ఈనెల 18న జరిగే 'ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం - పని దినాలు, వేతనాలు పెంచుకుందాం' అనే అంశంపై జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాల యంలో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఆరోజు ఉదయం పది గంటలకు ఏలూరు ఆర్ఆర్‌పేటలోని కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా సిపిఎం ఆలిండియా నాయకులు ఎంపీ శివదాసు, సిపిఎం రాష్ట్ర కార్య దర్శి వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, వి.శివ నాగరాణి పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సుకు వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న విద్యావాలంటీర్లు

విద్యావాలంటీర్ల భిక్షాటన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆదివాసీ మాతృ భాషా విద్యావాలంటీర్ల నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ బుధవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. మండలంలోని కోటరామచంద్రపురం ఐటిడిఎ వద్ద మాతృ భాషా విద్యా వాలంటీర్ల సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. విద్యావాలంటీర్ల నాలుగు నెలల వేతన బకాయిలు తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు రోజులుగా దీక్షలు చేపట్టినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో మాతృ భాషా విద్యా వాలంటీర్లు రహదారిపై భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, మాతృ భాషా విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కుంజా నవీన్ మాట్లాడుతూ 2019 నుండి ఐటిడిఎ పరిధిలో 101 పాఠశాలల్లో మాతృ భాష విద్యావాలంటీర్లుగా విధులు నిర్వహించినా వేతనాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. 2021-22 సంవత్సరంలో రెండు నెలలు, ఈ విద్యా సంవత్సరం రెండు నెలలు బకాయిలున్నాయన్నారు. వీటికోసం అధికారుల చుట్టూ తిరిగినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని, అందుకే నిరసన చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరావు, మాతృ భాషా విద్యా వాలంటీర్లు కె.రామకృష్ణ, మడకం కృష్ణవేణి, ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరీ, సాగర్, అరుణ, గీతామహాలక్ష్మి, గీతాంజలి పాల్గొన్నారు.

రోడ్డు దుస్థితిని చూపుతున్న సిపిఎం నాయకులు

పేరంపేట రోడ్డుకు మరమ్మతులు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పేరంపేట ప్రధానరహదారిని అభివృద్ధి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పేరంపేటలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో పేరంపేట గ్రామం నుండి పంగిడిగూడెం రోడ్డుపై మురుగు నీరు నిలిచి ఉండటంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ పేరంపేటలో రహదారులు చెరువును తలపిస్తున్నాయన్నారు. రోడ్డుపై నీళ్లు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాలు పడితే గ్రామం నుంచి వచ్చే మురుగునీరు డ్రెయినేజీలోకి వెళ్లే దారిలేక రోడ్డుపై నిలబడిపోతుందన్నారు. ఈ సమస్యపై గ్రామ సచివాలయం కార్యదర్శికి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై మురుగు వ్యర్థాలతో నీరు నిలిచి దోమలు విపరీతంగా పెరిగి ప్రజలకు డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వాపోయారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్ రావు, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు ఉపసంహరించాలి

ఏలూరులో రెండోరోజు కొనసాగిన సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సంతకాలు సేకరిస్తున్న నాయకులు

సర్దుబాటు, ట్రూ అప్ తదితర పేర్లతో రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న అదనపు విద్యుత్ భారాలను రద్దు చేయాలని సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం ఏలూరు తంగెళ్లమూడి సెంటర్‌లో ప్రజల నుండి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఎం ఏలూరు కార్యదర్శి పి.కిషోర్, సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బద్ద వెంకట్రావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం 2020 విద్యుత్ సవరణ చట్టాన్ని తెచ్చిందని, దాన్ని దేశంలో ఏ రాష్ట్రమూ అమలు చేయక ముందే మన రాష్ట్రంలో వైసిపి అమలు చేసిందన్నారు. దీనివల్ల ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్, సర్దుబాటు, సర్‌ఛార్జీ, అదనపు ఛార్జీల పేరుతో ఇప్పటికే నాలుగుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని విమర్శించారు. గతంలో పేదలకు రూ.200, రూ.300 వచ్చే బిల్లు ప్రస్తుతం రూ.వెయ్యి వస్తుందన్నారు. ఐదారు వందల రూపాయలు వచ్చే బిల్లు నేడు రూ.రెండు వేల నుంచి రూ.మూడు వేలు పైన వస్తుందన్నారు. దీనివల్ల ప్రజలపై మోయలేని భారం పడుతుంన్నారు. అసలే ప్రజలకు ఉపాధి అవకాశాలు తగ్గి, ఆదాయాలు పడిపోయి చాలా ఇబ్బందులు పడుతున్నారని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై ఏ మాత్రమూ కనికరం లేకుండా కరెంట్ ఛార్జీలు, ఇంటి, నీటి, చెత్త సేకరణ పన్నులు విధిస్తోందన్నారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రంలో ఉన్న పది వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేసి తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.జగన్నాధరావు, ఎం.ఇస్హాక్, ఎస్.సత్యనారాయణ, జికోటేశ్వరరావు, మీసాల సత్యనారాయణ, సిపిఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, నాయకులు ఎర్ర వెంకటేశ్వరావు, బల్ల కనకదుర్గారావు, కొండేటి బేబీ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు, కాకి నాని, క్రాంతి, పల్లి గంగరాజు, గుంజే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపా చట్టాన్ని రద్దు చేయాలని నిరసన

ఏలూరు అర్బన్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేకమంది ప్రజాసంఘాల నాయకుల ఇళ్లపై ఎన్ఐఎ దాడులు చేసి, సోదాలు నిర్వహించి, ఉపా చట్టం కింద కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తూ బుధవారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఉపా రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని, ప్రజాస్వామిక హక్కులను హరించే ఉపా చట్టాన్ని రద్దు చేయాలని, ప్రజాసమస్యలపై పోరాడే ప్రజాసంఘాల నాయకులపై ఎన్ఐఎ దాడులను అరికట్టాలని, రాజ్యాంగ హక్కులను కాపాడాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, పికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె.మస్తాన్, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నాని, కెఎన్‌పిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.జాన్‌రాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని సిఎం జగన్, తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రశ్నించే వారిని ఎన్ఐఎ వంటి తమ జేబు సంస్థలతో దాడి చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమైనప్పుడు ప్రశ్నించే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగంలో పౌరులకు కొన్ని ప్రాథమిక హక్కులు కల్పించారని, వాటిని నేటి పాలకులు హరిస్తున్నారని విమర్శించారు.

సిఎంచే నేడు చేబ్రోలు జగనన్న ఇళ్ల కాలనీ ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించనున్న జగన్

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని చేబ్రోలులో 5.93 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను ఈనెల 12న సిఎం జగన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ లే అవుట్ జిల్లాకు రోల్‌మోడల్‌గా నిలిచింది. అందుకు కృషి చేసిన అధికారులను ప్రభుత్వం ఉత్తమ అధికారులుగా అవార్డులతో సత్కరించింది. అర్హత పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు సిఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎమ్‌డి డాక్టర్ జి.లక్ష్మీషా కితాబిచ్చారు. చేబ్రోలులో జగనన్న ఇళ్ల సముదాలను ఆయన ఇటీవల సందర్శించారు.

పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు

ఈ కాలనీలో తాగునీటి కోసం బోరు వేశారు. ప్రతీ వీధికి విద్యుత్ సౌకర్యం, వీధి దీపాలను సైతం యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేశారు. మురుగునీటి వ్యవస్థ కోసం ప్రతిఇంటికీ రూ.ఆరు వేలతో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలు నిర్మించారు. 5.93 ఎకరాల అసైన్డ్ భూమిని ఎకరం రూ.30 లక్షలకు ప్రభుత్వం కొనుగోలు చేసి 259 ప్లాట్లను సిద్ధం చేసి లబ్ధిదారులకు కేటాయించారు. వారిలో తక్షణం ఇల్లు కట్టుకోవడానికి 181 మంది ముందుకు వచ్చారు. వాటిలో 81 ఇళ్లు పూర్తయ్యి మిగతా ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వారంతా ఇళ్లల్లో నివాసం ఉండటానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులను, అధికారులను అభినందించారు.



జగన్ ప్రారంభించనున్న కాలనీ ఇదే

జిల్లాలోనే ప్రత్యేకతను చాటిన చేబ్రోలు లే అవుట్

ఈగ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఎంఎల్ఎ వాసుబాబు, స్థానిక అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొన్నారు. తొలుత సేకరించిన భూమి కోర్టు వివాదంలో ఉండటంతో చేబ్రోలు - తిమ్మయ్యపాలెం దారిలో స్థానిక అట్టల ఫ్యాక్టరీ సమీపంలో అసైన్ట్ భూములను సేకరించేందుకు స్థానిక నాయకులు విశేషంగా కృషి చేశారు. భూసేకరణ చేసిన వెంటనే ఆగమేఘాల మీద సైట్ లెవిలింగ్, నీటికోసం బోరు, విద్యుత్ సౌకర్యాలను ఒకదాని తరువాత మరొకటి పూర్తిచేసేందుకు నిధుల కొరత లేకుండా ఎంఎల్ఎ వాసుబాబు కృషి చేశారు. సొసైటీ ఛైర్మన్ పాపారావు బాబ్జీ, మాజీ సర్పంచి కరణం బుజ్జి, ఎంపిటిసి రాయి లక్ష్మి, మనసాల నాగమణి, ఆకుల రాజా, వైసిపి నాయకులు సహకారం అందించారు.

ప్రారంభోత్సవ పటిష్ట ఏర్పాట్లు

ఇళ్ల ప్రారంభోత్సవానికి పెద్ద సంఖ్యలో వచ్చే కార్యకర్తలు, లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా అవసరమైన కుర్చీలు, తాగునీరు ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అధికారులకు సూచించారు. లే అవుట్ వద్ద సభా వేదికను ఆయన పరిశీలించి తగు సూచనలు, సలహాలిచ్చారు. సుమారు 2500 మంది కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా చేబ్రోలులోనే ప్రారంభమవుతున్న రీత్యా పలువురు ఎంఎల్ఎలు, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. ఎక్కడా ఎలాంటి సమస్యలూ రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తొలుత కాలనీలో అన్ని వీధులను తిరిగి పరిశీలించారు. హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ విజయరాజు, ఎంపిపి శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు జయలక్ష్మి, మండల కన్వీనర్ మంగారావు, జిల్లా కార్యదర్శి గోపీ, మాజీ సర్పంచి కర్ణం బుజ్జి, ఎంపిటిసి సభ్యులు రాయి లక్ష్మి, నాగమణి, పాపారావు బాబ్జీ పాల్గొన్నారు.

సౌందర్యమ్మ నేత్రదానం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మనం చనిపోయినా మన కళ్లు మరొకరికి చూపునివ్వడానికి ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఓ మహిళ తన కళ్లను దానం చేసింది. వివరాల్లోకి వెళితే ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన చింతల సౌందర్యమ్మ(63) అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల హైదరాబాదులోని ఓ ప్రయివేట్ హాస్పిటల్లో చేరి చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో ఆమె మంగళవారం రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. తాను మరణించాక తన కళ్లను దానం చేయాలని ఆమె ముందే తన కుమారులను కోరడంతో తల్లి కోరిక మేరకు కుమారులు దయానందరాజు, సుబ్రహ్మణ్యం హైదరాబాదులోనే ఎల్‌వి ప్రసాద్ నేత్ర ఇన్స్టిట్యూట్‌కి సమాచారం ఇవ్వడంతో వైద్యులు వచ్చి ఆమె కళ్లను సేకరించుకుని వెళ్లారు. సౌందర్యమ్మ అంత్యక్రియలు బుధవారం ముదినేపల్లిలో నిర్వహించారు. సౌందర్యమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాట్రాయి

నా వ్యాధికి సంబంధించిన మందులు పంపిణీ చేసి, నన్ను ప్రభుత్వమే ఆదుకోవాలని చిన్నంపేట గ్రామంలోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో చాట్రాయి ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్‌కు వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కొమ్ము ఆనందం వినతిని సమర్పించారు. సిపిఎం పార్టీలో ప్రజా సమస్యల కోసం నిరంతరం కృషి చేశానని, ఆరోగ్యం సహకరించకపోవడంతో కేవలం ఇంటికే పరిమితం అయ్యానని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా షుగర్ వ్యాధితో బాధపడుతున్న నాకు ప్యాంక్రియాస్ గ్రంథి సమస్య రావడంతో 2022 సంవత్సరంలో ఆపరేషన్ చేయించుకున్నానన్నారు. ప్రతి నెల మందులకు రూ.8 వేల వరకూ ఖర్చు అవుతుందని, నిరుపేద కుటుంబానికి చెందిన నన్ను ప్రభుత్వమే ఆదుకోవాలని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా తెలియజేశారు.


వరి పైరును పరిశీలిస్తున్న ఎడి వెంకటమణి

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని రైతులు సార్వా, వరి సాగులో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండవల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జి.వెంకటమణి తెలిపారు. మండలంలోని వడాలి, పెయ్యేరు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో వరిలో సమగ్ర సస్యరక్షణపై రైతులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరి పైరులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల వినియోగం, యాజమాన్యం పద్ధతుల గురించి జి.వెంకటమణి రైతులకు వివరించారు. అనంతరం క్షేత్ర సందర్శనలో పాము పొడ తెగులు గమనించి, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బొర్రా వేణుమాధవ్, పెయ్యూరు, వడాలి రైతు భరోసా కేంద్రాల ఇన్‌ఛార్జిలు అజయ్ కుమార్, దివ్య, పైరెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పులి శ్రీరాములకు ఘన సన్మానం

ఏలూరు టౌన్ : జాతీయ జూట్ కార్మిక సంఘం అధ్యక్షులు పులి శ్రీరాములును ఐఎన్‌టియుసి నాయకులు ఘనంగా సత్కరించారు. ఏలూరు జూట్ మిల్లును యాజమాన్యం అక్రమంగా మూసివేసినపుడు కార్మికుల పక్షాన నిలిచి పోరాటం చేశారని, అన్ని కార్మిక సంఘాలతో కలసి కార్మికులకు చట్టబద్ధంగా రావాల్సిన పిఎఫ్, గ్రాడ్యుటీలతో పాటు, అదనపు నష్టపరిహారంగా మూడున్నర నెలల వేతనం, పనిచేసిన కాలానికి సంవత్సరానికి రూ.3 వేలు చొప్పున అదనంగా ఇప్పించారని వారు తెలిపారు. కష్టకాలంలో తమకు తోడుగా నిలచిన పులి శ్రీరాములు సేవలను మరచిపోమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నాయకులు పామర్తి సీతారామయ్య, కోరాడ రాము, పసుమర్తి ప్రసాద్, వన్నెంరెడ్డి గణేష్, పెద్దిరెడ్డి నారాయణ, త్రినాథ్, రాము పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పాము కాటుకు రైతు మృతి

ప్రజాశక్తి - చాట్రాయి

మండల కేంద్రమైన చాట్రాయిలో మందపాటి నరసింహారెడ్డి(52) రైతు పాముకాటుకు గురై మంగళవారం రాత్రి మృతి చెందాడు. చాట్రాయి గ్రామంలోని తన సొంత పంట భూమిలో వ్యవసాయ మోటారు నీళ్లు పెట్టుటకు వెళ్లగా పాముకాటుకు గురై మృతిచెందాడు. మృతి చెందిన వ్యక్తి టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవా రెడ్డి సోదరుడు కావడంతో బుధవారం విషయం తెలుసుకున్న నూజివీడు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు, నూజివీడు ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, నూజివీడు నియోజకవర్గ టిడిపి నాయకులు పర్వతనేని గంగాధర్, చాట్రాయి మండల టిడిపి అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, పుచ్చకాయల నోబుల్ రెడ్డి నరసింహారెడ్డి మృతదేహానికి నివాళులర్పించి, మందపాటి బసవారెడ్డిని పరామర్శించి సానుభూతి తెలియజేశారు. మృతునికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు కలరు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యక్తులపై కేసు

ప్రజాశక్తి - ముసునూరు

ఫారం కోళ్ల వ్యర్థ పదార్థలను తరలిస్తున్న డ్రైవర్, టిప్పర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యం.కుటుంబరావు తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని గోపవరం, నాగేంద్రపురం సెంటర్ వద్ద ఎస్ఐ యం.కుటుంబరావు తమ సిబ్బందితో కలిసి వాహనాలను చెకింగ్ చేస్తుండగా, ఖమ్మం జిల్లా ఏరియాలోని కోళ్ల ఫారాల నుంచి పాడైపోయిన కోళ్ల వ్యర్థపదార్థలను టిప్పర్‌లో భీమడోలు మండలం ఆగడాలలంక గ్రామాల్లోని చేపల చెరువులకు తోలుతున్నట్టు పోలీసులకు సమాచారం అందిదన్నారు. దీంతో టిప్పర్ యాజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కావలెను

ప్రజాశక్తి దినపత్రికకు దిగువ కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఏలూరు కల్చరల్, ఏలూరు సిటీ, భీమవరం టౌన్, తాడేపల్లిగూడెం టౌన్, నరసాపురం అర్బన్, తణుకు టౌన్, నూజివీడు టౌన్

రూరల్ : జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఏలూరు, వేలేరుపాడు, కుక్కునూరు, కెఆర్.పురం ఐటిడిఎ, నరసాపురం, తాడేపల్లిగూడెం, కైకలూరు, దెందులూరు, పెదవేగి, పెదపాడు, నిడమర్రు, లింగపాలెం, అత్తిలి, ఇరగవరం, పెంటపాడు

విద్యార్హత: ఇంటర్

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

ఎడివిటి ఇన్‌ఛార్జి: నూజివీడు
మార్కెటింగ్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

ఇంటర్వ్యూ తేదీ:
14-10-23 శనివారం ఉదయం పది గంటలకు
ప్రదేశం: ప్రజాశక్తి కార్యాలయం, పవర్‌పేట, ఏలూరు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్స్
సెల్: 9949366196, 8919170815, 9490099168

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

బిట్రగుంట(నెల్లూరు జిల్లా) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ సంఘటన నెల్లూరు జిల్లా బోగోలు మండలం కడనూతల జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శేఖర్‌బాబు సమాచారం మేరకు.. మృతులు సుబ్బరాజు(65) నిడమర్రు గ్రామం, వెస్ట్ గోదావరి జిల్లా, రామానాయుడు(65) వేమూలూరు గ్రామం, కొవ్వూరు మండలం, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు. వారి గ్రామాల నుంచి తిరుమలకు న డుచుకుంటూ బయల్దేరారు. బు ధవారం మధ్యాహ్నం నెల్లూరు జిల్లా బోగోలు మండలం, కడనూతల చెరువు కట్ట వద్ద రోడ్డు పక్కన కూర్చుని సేద తీరుతున్నారు. చెన్నయ్ నుంచి ఒంగోలు వైపు వెళుతున్న లారీ అతివేగంగా పక్కనే ఆగి ఉన్న లారీని గుద్దింది. అక్కడ కూర్చున్న వారిద్దరిపై నుంచి లారీ ఎక్కడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పని ఒత్తిడిలో డ్వాక్రా సిఎలు ..!

ఇకెవైసి బాధ్యతలు వారికే అప్పగింత

ప్రజాశక్తి - ఉంగుటూరు

వైఎస్ఆర్ చేయూత లబ్ధిదారుల ఈకెవైసి బాధ్యతలు డ్వాక్రా సిఎలకు అప్పగించడంతో పనిభారంతో సిఎలు ఇబ్బందులు పడుతున్నారు. నవ రత్నాలలో భాగంగా సిఎం జగన్ 45 సంవత్సరాల వయసు దాటిన మహిళలకు వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా ప్రతి ఏటా రూ.17 వేల 750 లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు వేస్తున్నారు. అర్హులైన మహిళల వివరాలను ఇప్పటి వరకూ గ్రామ వాలంటీర్లే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, ఈకెవైసి చేయించడం వంటి బాధ్యతలు నిర్వహించేవారు. సెర్ప్ సంస్థ నిధులతోనే చేయూత అందిస్తున్నారు. ఇప్పటి వరకూ మూడు విడతలుగా పంపిణీ చేయగా, ఈ నాలుగో విడత చేయూత పంపిణీ ఈకెవైసి చేయించే బాధ్యతలను ఈసారి డ్వాక్రా కమ్యూనిటీ యాక్టివిటిస్టులు(సిఎ)కు బాధ్యత అప్పగించారు. గ్రామ వాలంటీర్లకు జగనన్న ఆరోగ్య సురక్షా సర్వే పనులు అప్పగించడటంతో చేయూత ఈకెవైసి సిఎలకు అప్పగించినట్లు సమాచారం.

ఉంగుటూరు మండలంలో 4,370 మంది చేయూతకు ఎంపికయ్యారు. వాళ్లందరి వేలిముద్రలను 54 మంది సిఎలు తీసుకుని ఈకెవైసి చేయాల్సి రావడంతో పని భారంతో సతమతం అవుతున్నారు. వాలంటీర్లు అయితే వారి పరిధిలో తక్కువ మంది లబ్ధిదారులు ఉంటారు కాబటి ఈకెవైసి ఒక్క రోజులోనే పూర్తయ్యేది. అలాంటిది సిఎకు అప్పగించడంతో ఒక్కో సిఎకు సుమారు 150 నుంచి 200పైగా చేయూత లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించి, యాప్‌లో అప్‌లోడ్ చేసి, ఈకెవైసి పూర్తి చేయించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో లబ్ధిదారులు వేలిముద్రలు వేసేందుకు అధిక సమయం కేటాయించాల్సి వస్తోంది.

ప్రజల వద్దకే వైద్య సేవలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజల ముంగిటకే వైద్య సేవలను అందిస్తున్న ఘనత సిఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని కైకలూరు ఎంఎల్ఎ తనయులు దూలం ఆది వినయ్ కుమార్ తెలిపారు. మండలంలోని వాడవల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, ఎంపిటిసి దూసనపూడి లక్ష్మీకుమారి, వైస్ ఎంపిపి రాచూరి రాధ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, గ్రామ సర్పంచి సుధాబత్తుల రమణ, వి.రావిగుంట సర్పంచి అర్జా రామ జోగేశ్వరావు, నాయకులు బొర్రా శ్రీహరిదాసు పాల్గొన్నారు.


టి.నరసాపురం సురక్ష కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒ ఎమ్‌డి

పోలవరం : మండలంలోని చేగొండపల్లి, మామిడిగొంది గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంపిడిఒ జి.శ్రీను, జెడ్‌పిటిసి, మండల కన్వీనర్, వైస్ ఎంపిపిలు, సొసైటీ అధ్యక్షులు, స్థానిక సర్పంచి పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రతీ వ్యక్తికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నట్లు ఎంపిపి రాంబాబు, చింతంపల్లి సర్పంచి రామకృష్ణ తెలిపారు. మండలంలోని చింతంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపిడిఒ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒ ఎమ్‌డి రజావుల్లా తెలిపారు. మండలంలోని రాజు పోతేపల్లి గ్రామంలో బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి వెంకటేశ్వరరావు, సర్పంచి బొంతు రమాదేవి అంజిబాబు, ఎంపిటిసి బొడ్డపాటి రాంబాబు, తహశీల్దార్ జెవి సుబ్బారావు, ఎంపిడిఒ మంగాకుమారి, ఎంఇఒ కళ్యాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, మండల వైద్యాధికారులు జె.కల్పనా రాణి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ముసునూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగన్న సురక్ష కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యమై ఆరోగ్యకరంగా వుండాలని ఎంపిడిఒ జి.రాణీ తెలిపారు. బుధవారం మండలంలోని గోపవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచి కంచర్ల వాణీ, ఎంపిడిఒ జి.రాణీల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పాముల గంగాధరరావు, వైద్యులు యం.కిరణ్‌కుమార్, డాక్టర్ కరిముల్లా, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, సూపరిడెంట్ కూచిపూడి సాయిరామ్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బొత్స దృష్టికి ఉద్యోగుల సమస్యలు : చోడగిరి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మంత్రి వర్గ ఉప సంఘంలో ముఖ్య ప్రతినిధి బొత్స సత్యనారాయణను కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించినట్లు జిల్లా ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని వారి క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఉద్యోగుల సరెండర్ లీవ్స్, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, పోలీసులుకి సరెండర్ లీవ్స్ త్వరితగతిన ఇవ్వాలని, అదేవిధంగా కాంట్రాక్టు ఉద్యోగుల జిఒ, మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులకు 35 రోజుల క్యాజువల్ లీవ్స్‌తో పాటు, 5 రోజుల స్పెషల్ క్యాజువల్ లీవ్స్ జిఒ ఇంకా రాలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. దీనికి మంత్రి బొత్స స్పందిస్తూ సంబంధిత ఫైనాన్స్ అధికారులు, సాధారణ పరిపాలన శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే జిఒలు ఇవ్వాలని చెప్పినట్లు, జీతాలు పడిన తర్వాత సరెండర్ లీవ్స్‌ని దశల వారిగా ఇస్తామని మంత్రి ఎన్‌జిఒ సంఘ నాయకులకు హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ చర్చల్లో రాష్ట్ర ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కెవి శివారెడ్డి, జిల్లా అధ్యక్షులు కొటారు ఈశ్వర్ రావు, చోడగిరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - చాట్రాయి

పభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం శు భ్రమైన వంటలు చేసి, విద్యార్థులకు రుచికరంగా అందించాలని భోజనం అందించాలని ఎంఇఒ బ్రహ్మాచారి తెలిపారు. మండల కేంద్రమైన చాట్రాయిలో మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీలకు బుధవారం ఆయన అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఇఒ మాట్లాడుతూ నిలవచేసి పురుగులు పట్టిన బియ్యం, నిలవ ఉన్న రాగి పిండి, పాడైన కోడిగుడ్లు ఎట్టి పరిస్థితుల్లో విద్యార్థులకు వండి పెట్టకూడదన్నారు. వంటలు గ్యాస్ పొయ్యి మీద మాత్రమే చేయాలని, అది స్కూలు ఆవరణలోనే చేయాలని తెలిపారు. త్వరలో వంట ఏజెన్సీలకు వంట సామాగ్రి అందిస్తామని తెలిపారు. ఆయన మాట్లాడుతుండగా కొందరు వంట ఏజెన్సీలు తమకు మెనూ బిల్లులు సక్రమంగా రావటం లేదని, గౌరవవేతనం ఇవ్వటం లేదని ఆరోపించారు. జిల్లా కమిటీ సభ్యులు డి.పుల్లారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీలకు పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనాలు వెంటనే చెల్లించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ శేఖర్ బాబు, కంప్యూటర్ ఆపరేటర్ కంకట బాబూరావు, మండలంలోని మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీల సభ్యులు పాల్గొన్నారు.

వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు సాగర్‌బాబు ఎంపిక

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మద్దాల సాగర్‌బాబు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎ.సునీత మాట్లాడుతూ సాగర్‌బాబు ఎంపిక పట్ల ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో కడప జిల్లాలోని మైదుకూరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో సాగర్‌బాబు ఆడనున్నాడని తెలిపారు. ఆ పోటీల్లో మరింత ప్రతిభ కనబర్చి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థిని వ్యాయామ ఉపాధ్యాయులు మహ్మద్ ఆలీఖాన్, హేమదేవి, ఉపాధ్యాయులు జి.నాగేశ్వరరావు, ఫ్రాన్సిస్ అభినందించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం : మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టిడిపి కార్యకర్త పులపాకుల రాజశేఖర్ కుటుంబానికి టిడిపి నాయకులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. బుధవారం పులపాకుల రాజశేఖర్ కుటుంబాన్ని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు, మండల పార్టీ అధ్యక్షుడు సాయిల సత్యనారాయణలతో సొంగా రోషన్ కుమార్ పరామర్శించారు. రాజశేఖర్ మృతి చెందిన రోజు తక్షణ సాయంగా రూ.10 వేలు అందించిన సొంగా రోషన్ కుమార్ తదుపరి కార్యక్రమానికి మరో రూ.10 వేలు అందజేశారు. పిల్లల భవిష్యత్తు కోసం కొంత నగదు పిక్సిడ్ డిపాజిట్ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పొల్నాటి సత్యనారాయణ, నాయకులు రాగాని శ్రీనివాస్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, మల్లిపూడి నవీన్ పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


చిన్నారిని పరామర్శిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 20 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా, సికిల్స్ ఎనీమియా వ్యాధి చిన్నారులు నెలకు రెండు నుంచి మూడుసార్లు రక్తం ఎక్కించుకోవాల్సి వస్తుందని, కాబట్టి స్వచ్ఛంద రక్తదాతలు ముందుకు వచ్చి తలసేమియా చిన్నారులను ఆదుకోవాలని కోరారు. మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రతీ వారం తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి రోజున ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. బుధవారం తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు 50 మందికి మానవత ట్రెజరర్ అల్లూరి మోహిని భోజనం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ ఆర్‌కె.వరప్రసాదరావు, అల్లూరి మోహిని, కడియాల కృష్ణారావు, మేతర అజయ్ బాబు, సాయి సుధా పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలి

విద్యార్థుల వినూత్న ప్రదర్శన

ప్రజాశక్తి - మండవల్లి

అవినీతిని అరికట్టేందుకు ప్రజలకు ఉన్న ఒకే ఒక ఆయుధం సమాచార హక్కు చట్టమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈనెల 12వ తేదీన సమాచార హక్కు చట్టం 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కానుకొల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఇద్దరు విద్యార్థులు సిద్ధపడి, ప్రతి మూడు నెలలకు ఒక ఆర్‌టిఐ ద్వారా గ్రామ పంచాయతీలోని సమాచారాన్ని అడిగి తెలుసుకుని, గ్రామంలో తెలియజేస్తే క్రమంగా అవినీతి తగ్గిపోతుందని తెలిపారు. అనంతరం ఆర్‌టిఐ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఆర్‌టిఐ ఇంగ్లీషు అక్షరాలలో వినూత్న ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక మండల అధ్యక్షుడు టి.అప్పారావు, ప్రధానోపాధ్యాయులు మాధవ కుమార్, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కురెళ్ల శ్యాంప్రసాద్, పిడి కె.సత్యనారాయణ, సిహెచ్ ఎస్ఎన్.మూర్తి, వి.బ్రహ్మానందం, ఎం.శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎల్ఎ వెంకట ప్రతాప్ పుట్టినరోజు

ముసునూరులో ఎంఎల్ఎకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి నాయకులు


ఆగిరిపల్లిలో శుభాకాంక్షలు తెల్పుతున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - ముసునూరు

మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకుని ప్రజలకు ఎంతో సేవచేయాలని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు బుధవారం వైసిపి నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచి రేగుల గోపాలకృష్ణ, వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు తులిమెల్లి సుబ్బారావు, మండల వైసిపి యూత్ లీడర్ గూట్రు రంగారావు, వైసిపి నాయకులు దేవినేని రవిబాబు, యం.రామారావులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆగిరిపల్లి : నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తన పుట్టినరోజు సందర్భంగా ఆగిరిపల్లి శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరశింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఎంఎల్ఎ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, ఎంపిటిసి ఎస్.గోపినాథ్, వైసిపి జిల్లా కార్యదర్శి ఎం.హరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు పి.నరశింహారావు, నాయకులు జి.ఇస్సాక్, ఇవి.సుబ్బయ్య, ఆర్.సురేష్‌కుమార్, జి.సాంబశివరావు, ఎ.మురళీ పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు హేయం : టిడిపి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిలో మోకాళ్లపై నుంచుని నిరసన తెల్పుతున్న టిడిపి నేతలు

ఆంధ్రప్రదేశ్‌ని ప్రపంచ పుటల్లో నిలిపిన దార్శనికుడు చంద్రబాబు నాయుడని, అలాంటి వ్యక్తిని అరెస్టు చేయడం హేయమైన చర్య అని చింతలపూడి నియోజకవర్గ మహిళా నాయకురాలు యాళ్ల లీలా ప్రశాంతి, నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం తెలిపారు. నగర పంచాయతీలోని బట్టువారిగూడెంలో టిడిపి ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడుకి మద్దతుగా మేము సైతం బాబు కోసం అంటూ ప్రతీ ఇంటికీ తిరిగి కర పత్రాలు పంపిణీ చేసి, మోకాళ్ల మీద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు మారుమూడి థామస్, ఎంపిటిసి తుల్లిమిల్లి భాస్కర్, నందిపాము నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముసునూరు : చంద్రబాబు అరెస్ట సమయంలో తాను లండన్‌లో ఉన్నానని, ఆ విషయం తనకు తెలియదని సిఎం జగన్ చెప్పడం ప్రజల చెవిలో పూలు పెట్టినట్టెందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. రమణక్కపేట గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గద్దే రఘు బాబు, లక్కపాము కాంతారావు, పర్వతనేని వెంకటేశ్వరరావు, కాటేపల్లి సత్యనారాయణ, కందుల పిచ్చయ్య పాల్గొన్నారు.

ముదినేపల్లి : నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును పురస్కరించుకొని బుధవారం టిడిపి నాయకులు బాబుతో నేను కరపత్రాలు పలు గ్రామాల్లో పంపిణీ చేశారు. ఇందులో భాగంగా మండలంలోని సంకర్షణపురం గ్రామంలో మండల టిడిపి మాజీ అధ్యక్షులు వీరమల్లు నరసింహరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సంకుల నాని, మండల కో-ఆప్షన్ మాజీ సభ్యులు మజీద్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

పోలవరం : మండలంలోని ప్రగఢపల్లి పంచాయతీకి చెందిన తొంట హరికృష్ణ పోశీ కుమార్ పొలంలో కరెంట్ షాక్‌తో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సిఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షల చెక్కును పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు బుధవారం అందజేశారు. భర్త మృతి చెందడంతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని ఆదుకోవాలని.. గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ దృష్టికి మృతుడు భార్య తోంట నాగమణి తీసుకురావడంతో ఎంఎల్ఎ చొరవతో చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి, ప్రగఢపల్లి ఎంపిటిసి దాపర్తి మోహన రావు ఉన్నారు.

అమరావతి పత్రిక ఎడిటర్ మంగారావుకు పలువురి పరామర్శ

ద్వారకాతిరుమల : మండలంలోని కోడిగూడెం గ్రామానికి చెందిన అమరావతి పత్రిక ఎడిటర్ గురజాల మంగారావు మాతృమూర్తి గురజాల పాటమ్మ(73) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు కోడిగూడెంలో వారి స్వగృహం వద్ద మంగారావును పరామర్శించారు. ఆయనతో వైసిపి నాయకులు పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, దాసరి ఏసురత్నం, మానుకొండ సుబ్బారావు, చెలికాని బుల్లియ్య, మానుకొండ ప్రసాద్, గోపా నాగేశ్వరరావు, పెండ్యాల విజయ్, నిట్టా నాగేశ్వరరావు, తదితరులున్నారు. అలాగే గోపాలపురం టిడిపి కన్వీనర్ మద్దిపాటి వెంకటరాజు మంగారావు కుటుంబాన్ని పరామర్శించారు.

శ్యామ్ మృతికి సంతాపం

లింగపాలెం : ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన రాచూరి శ్యామ్ పార్థివ దేహానికి నివాళు లర్పించి, శ్యామ్ కుటుంబ సభ్యులను టిడిపి యువనాయకులు సొంగా రోషన్ కూమర్, లీలా ప్రశాంతి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌కి వెళ్లి సిఐ, ఎస్ఐను కలిసి పంచనామా ద్వారా శ్యామ్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున అందాల్సిన బెనిఫిట్స్ గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను, ప్రకాష్ పాల్గొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, తిమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన కంచర్ల వీర వెంకట దుర్గాప్రసాద్, తండ్రి: నాగేశ్వరరావు అనే నేను గత నెలలో నా ఇంటి దస్తావేజులను ఫోటోస్టాట్ తీయించుకునేందుకు బైక్ మీద కైకరం వస్తుండగా మార్గ మధ్యలో ఎక్కడో జారిపోయాయి. **దస్తావేజు నెం. 632/2008** ల లింకు డాక్యుమెంట్లు మిస్ అయ్యాయి. కావున దస్తావేజులు దొరికినవారు ఈక్రింది చిరునామాకు అందజేయగలరని కోరుచున్నాము.

కంచర్ల వీర వెంకట దుర్గాప్రసాద్
తండ్రి: నాగేశ్వరరావు, కుమ్మరివీధి
తిమ్మయ్యపాలెం, ఉంగుటూరు మండలం
ఏలూరు జిల్లా - 534 406

In the Court of the Hon'ble Junior Civil Judge, Bhimadole, West Godavari District
E.P. No. 14/2020 in O.S. No. 305/2018

Between:
Sri Maradani Pavan Kumar ...D.Hr
AND
Sri Sydu Srikanth ...J.Dr

To:
పై నెంబరులో J.Dr. అయిన Sydu Srikanth, S/o. Nagaraju, D.No. 5-75, Prathikollalanka, Eluru Rural Mandal, West Godavari District అను మీకు చాలాసార్లు నోటీసులు కోర్టు నుండి అమలు నిమిత్తం పంపినప్పటికి అమలు కాలేదు. కావున సదరు కేసు ది. 10-11-2023 నాటికి వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు మీరు ఉదయం గం॥ 10.00 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పై కోర్టు వారు మీ పరోక్షమందు సదరు కేసు తీర్మానించెదరు. కావున మీకు తెలియపర్చడమైనది.

(ది. 10-10-2023వ తేదీ నాటి శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.వి.పి.మాధవరావు
అడ్వకేట్ & నోటరీ
అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు
ఏలూరు కోర్టు సెంటర్
సెల్: 9440111033
స్థలం: ఏలూరు
తేది:12-10-23

నోటీసు

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 201/2016

Between:
Teegavarapu Venkateswara Rao ...వాది
AND
Teegavarapu Venkata Subrahmanyam and Others 9 ...ప్రతివాదులు

TO: D-9: Eella Naga Laxmi, W/o. Durgaprasad, Hindu, Female, Age about 34 Years, House Wife, C/o. M.Peddintlamma, W/o. Late Rama Krishna, Raghavapuram Village & Post, Chintalapudi Mandal, CH.J.C.J.C.

పై తెల్పిన దావాలో మీకు నోటీసు అమలు నిమిత్తం ది.30-10-2023కు వాయిదా అయి ఉన్నది. సదరు దావాలో మీకు ఎట్టి ఆక్షేపణలు లేక అభ్యంతరములు ఉన్న ఎడల మీరు స్వయంగా లేక మీ తరపు ప్లీడరు గారి ద్వారా గాని **ది.30-10-2023న ఉదయం గం॥10:30 ని॥లకు హాజరై మీ సమాధానం తెల్పుకోగలరు.** అట్లు మీరు హాజరు కాని ఎడల సదరు శ్రీ కోర్టు వారు మీపై Exparty ఉత్తర్వులు జారీ చేసి మీ పరోక్షమున దావాను విచారించెదరని మీకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

M.P.RAMESWARA KUMAR
B.V.RAGHAVA SARMA
Advocate, Eluru.
Cell: 98485 92285
Eluru,
06-10-23.